

బాన్సువాడలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, వేదికపై మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, బీఆర్‌ఎస్ నాయకులు

# మోసం కాంగ్రెస్ నైజం

- మాయమాటలతో అధికారంలోకి..
- ఆరు గ్యారంటీల అమలు గాలికి..
- పోచారం పైసల కోసమే పార్టీ మారిండు
- వేధించే వారి పేర్లు పింక్ బుక్‌లో ఎక్కిస్తున్నాం
- మేము వచ్చాక అందరి సంగతి చూస్తాం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరిక
- బాన్సువాడ, డిచ్‌పల్లిలో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాలు

బాన్సువాడ, ఏప్రిల్ 15: మాట తప్పడం, మడప తిప్పడం కాంగ్రెస్ పార్టీ నైజమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మనల్ని ఏండ్ల కొద్దీ కష్ట పెట్టిన పార్టీ.. ఆ పార్టీ కనికట్టు మాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. అటువంటి పార్టీలోకి పోచారం శ్రీనివాసరెడ్డి పోయిండని. ఆయన ప్రజల కోసం పార్టీ మారలే.. పైసల కోసం మారిండని ధ్వజమెత్తారు. ఈ నెల 27న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభ నేపథ్యంలో బాన్సువాడలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డితో కలిసి కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరువీరుల స్తూపానికి నివాళులు అర్పించి, గులాబీ జెండాను ఎగురవేశారు. అనంతరం భారీగా తరలివచ్చిన గులాబీ శ్రేణులనుద్దేశించి కవిత ప్రసంగించారు.

### గ్యారంటీలకే గ్యారంటీ లేదు..

మోసం చేయడమే కాంగ్రెస్ నైజమని కవిత విమర్శించారు. 'ఎన్నికల ముందర సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ సంతకాలు పెట్టిన గ్యారంటీ కార్డులను ఇంటింటికీ పంచి ఓట్లేయించుకుండ్రు. ఇప్పుడు ఆ గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేసిండ్రు. గతంలో తెలంగాణ ఇస్తామని హామీ ఇచ్చి పదేండ్ల పాటు అరిగోస పెట్టింది ఇదే కాంగ్రెస్ పార్టీ. వందలాది మంది తెలంగాణ బిడ్డల ఆత్మ బలిదానాలకు ఆ పార్టీయే కారణమని' విమర్శించారు. ఏడాదిన్నర పాలనలోనే తీవ్ర స్థాయిలో వ్యతిరేకత, అపకీర్తి మూటకట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు.

### ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది బీఆర్‌ఎస్సే..

తెలంగాణ గడ్డ మీద అగ్గి పుట్టించి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదని కవిత తెలిపారు. నలిగిపోయిన ఆత్మగౌరవాన్ని రెపరెపలాడించింది గులాబీ పార్టీ అని పేర్కొన్నారు. స్వతంత్ర దేశంలో లక్ష్యాన్ని చేరిన ఏకైక ఉద్యమం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ఉద్యమం మాత్రమే అని చెప్పారు. ప్రజాస్వామ్య పంథాను నమ్ముకొని అహింసాయుతంగా పోరాటం చేసి తెలంగాణ ను సాధించామని తెలిపారు. కేసీఆర్ త్యాగాలతో తెలంగాణ కోసం మొదటి అడుగువేశారని, కేంద్ర మంత్రి పదవిని సైతం గడ్డిపోచలా వదిలేసిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. ఎవరో భిక్ష పెడితేనో.. ఎవరో దయ తల్చి ఇస్తేనో తెలంగాణ రాలేదని.. కేసీఆర్ త్యాగం, కృషి, పోరాట పటిమ వల్లే తెలంగాణ సాధ్యమైందని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడితే కటిక చీకటి వస్తుందని, నక్సలైట్ల రాజ్యం వస్తుందని అప్పటి ఆంధ్ర ఆఖరి కిరణం కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారని గుర్తు చేసిన కవిత.. తెలంగాణ వచ్చినంక వెలుగు జిలుగుల తెలంగాణగా, కోటి ఎకరాల మాగాణిగా తయారుచేసుకున్నామన్నారు. రైతులంటే కేసీఆర్‌కు ప్రాణమని, అందుకే రైతుబంధు, రైతుబీమా వంటి అనేక పథకాలు తెచ్చాడన్నారు. కరోనా కష్ట సమయంలో కూడా చివరి గింజ దాకా కొనుగోలు చేసిన చరిత్ర కేసీఆర్‌ది అని తెలిపారు. ఆపద కాలంలోనూ ప్రజలకు పెన్షన్లు అందించారన్నారు. దేశ ముఖచిత్రాన్ని మార్చింది, దేశానికి విప్లవం నేర్పిన పార్టీ బీఆర్‌ఎస్ అని కవిత వ్యాఖ్యానించారు. రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలి రావాలని ఆమె పిలుపునిచ్చారు. సభకు వెళ్లొద్దని ఎవరు భయపెట్టినా క్షణాల్లో ఫోను కొట్టాలని, మీకు అండగా తాను, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి, జీవన్ రెడ్డి ఉన్నామని కవిత భరోసా ఇచ్చారు.



### నేను కొంచెం రౌడీ టైపు..

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లొద్దని కొంత మంది ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని తెలిసింది. అది కాంగ్రెస్ నాయకులైనా, అధికారులైనా ఊరుకునేది లేదు. వారి పేర్లను పింక్ బుక్‌లో రాసుకుంటున్నాం. వచ్చేది మా ప్రభుత్వమే. బెదిరించిన ఏ ఒక్కరినీ ఉపేక్షించబోమని కవిత స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడబోమని తేల్చి చెప్పారు. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని, వాళ్ల తాతలు, ముత్తాతలు, జేజమ్మలు దిగొచ్చినా ఇక్కడ భయపడడానికి ఎవరూ లేరన్నారు. కేసీఆర్ మంచోడు కావొచ్చు కానీ నేను మాత్రం కొంచెం రౌడీ టైపే అని హెచ్చరించారు.



### బాన్సువాడ శని పుత్రుడు పోచారం

బీఆర్‌ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

బీ ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో బాన్సువాడకు కోట్లాది నిధులు తెచ్చుకొని, కష్ట సమయంలో పార్టీని మోసం చేసి వెళ్లిపోయిన పోచారం శ్రీనివాసరెడ్డికి బాన్సువాడలో గాచారం పట్టిందని మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ లక్ష్మీపుత్రుడిగా నామకరణం చేస్తే, కాంగ్రెస్ పార్టీలో చేరి పోచారం బాన్సువాడకు శనిపుత్రుడిగా మారాడని ఎద్దేవా చేశారు. పోచారం కుటుంబీకులు ఈస్ట్, వెస్ట్, సౌత్, నార్త్ నాలుగుదిక్కుల దోచుకునేందుకు డమ్మి సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పార్టీ మారారని విమర్శించారు. మూడు ఇసుక క్వారీలు, కంకర మిషన్ల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారని, ప్రజల కోసం కాదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పోచారం పులిలా ఉండేవారని, కానీ ఇప్పుడు తినమరిగిన గండుపిల్లిగా మారారని విమర్శించారు. ఈ నెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ఉమ్మడి నిజామాబాద్ నుంచి లక్షలాది బీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా సద్దికట్టుకొని తరలిరావాలని కోరారు.బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లేవారిని అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పోలీసులు అడ్డుకున్నా, బెదిరించినా, అక్రమంగా కేసులు పెట్టినా సహించేదిలేదన్నారు. వారి పేర్లను పింక్ బుక్‌లో రాసుకుంటామని హెచ్చరించారు.



సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

### ఇసుక, కంకర కోసమే పార్టీ మారిన పోచారం

రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



మంజీరలో ఇసుక, కంకర గుట్టలు, సెటిల్‌మెంట్ల కోసమే తుపాకీరాముడు రేవంత్ మాటలు విని పోచారం పార్టీ మారారని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. ఎక్కడ పచ్చగా ఉంటే అక్కడే మేసేటోడని పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ తీర్థం తీసుకుంటాడని తెలిపారు. తాను బాన్సువాడకు 2008లో పదిమందితో మొదటి సారి వచ్చానని, పోచారం బెదిరింపులకు భయపడి ఈ ప్రాంతవాసులు ఒక్కరు కూడా దగ్గరికి రాలేదని గుర్తు చేశారు. అప్పటి నుంచి పోచారం ఇక్కడ ఎవరినీ ఎదగనివ్వలేదని ఆరోపించారు. ఆయన నాలుగు సార్లు మంత్రిగా పనిచేసినా, తాను ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి నీళ్లు తాగించానని చెప్పారు. కేసీఆర్‌కు కష్ట కాలంలో వెన్నంటి ఉండకుండా మోసం చేశాడని మండిపడ్డారు. పోచారం అనుభవంగల నాయకుడని సలహాదారుడిగా తీసుకున్నారని, కానీ ఆయనకు మాత్రం జీతం, ప్రొటోకాల్ కావాలన్నారు. బాన్సువాడకు ఇటీవల మూడు సార్లు రాగా, రెట్టింపు స్థాయిలో కార్యకర్తలు పోచారం చెర నుంచి బయటపడి బీఆర్‌ఎస్ సమావేశాలకు రావడం సంతోషంగా ఉందన్నారు.



చింతల నాగారం చెక్‌డ్యాం వద్ద సెల్ఫీ తీసుకుంటున్న ఎమ్మెల్సీ కవిత

బాన్సువాడపట్టణానికి సమీపంలో మంజీరా నదిపై నిర్మించిన చింతల నాగారం చెక్‌డ్యాంను ఎమ్మెల్సీ కవిత బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే బాన్సువాడ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని ఆమె అన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దారని చెప్పడానికి ఇక్కడి జరిగిన అభివృద్ధే సాక్ష్యమని తెలిపారు. మండు వేసవిలోనూ మత్తడి దుంకుతున్న ఈ చెక్ డ్యాం.. కేసీఆర్ తెలంగాణను పచ్చగా మార్చడానికి పడిన తపనను గుర్తు చేస్తున్నదని కవిత పేర్కొన్నారు.

### మమేకమై కూలీలతో ముచ్చటిస్తూ..



చింతలనాగారం చెక్‌డ్యాం సందర్శన అనంతరం తిరిగివస్తుండగా పంట చేలలో పనిచేస్తున్న కూలీలు, మహిళల వద్ద వాహనం ఆపి, వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. మిషన్ భగీరథ నీరు పచ్చగా వస్తున్నదని, డబుల్ బెడ్‌రూం ఇండ్లు రాలేదని, ఉన్నవారికే ఇచ్చారని పలువురు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మళ్లీ మన సర్కార్ వస్తుందని, అప్పుడు కట్టుకుందామని కవిత వారికి భరోసా ఇచ్చారు. కేసీఆర్ సారు బాగుండే అని, ఇప్పుడు పనులు అయితలేవని, పెన్షన్లు వస్తలేవని మరి కొందరు చెప్పారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కత్తి ఒక్కరికి ఇచ్చి , యుద్ధం వేరొకరిని చేయమంటే కరెక్టా అని అడుగగా, తామంతా కారు గుర్తుకు ఓటు వేశామని మహిళలు చెప్పారు. రాబోవు రోజుల్లో మనం మళ్లీ అధికారంలోకి వస్తామని, అన్ని సమస్యలు పరిష్కరించుకుందామని ఎమ్మెల్సీ కవిత హామీ ఇచ్చారు.

## రేవంత్ సర్కార్‌పై తీవ్ర వ్యతిరేకత

- అందుకే ప్రజలు బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నరు..
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ పార్టీలో చేరిన మాజీ సర్పంచులు

మోర్తాడ్, ఏప్రిల్ 15: కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని, అందుకే బీఆర్‌ఎస్ వైపు చూస్తున్నారని మాజీమంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనపై విసుగుచెందిన ప్రజలు సీఎంగా మళ్లీ కేసీఆర్ కావాలనుకుంటున్నారని పేర్కొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మెండోరా మండలం సోన్‌పేట్, దూదిగాం గ్రామ మాజీ సర్పంచులు గోలిప్రకాశ్, పసుల శ్రీనివాస్‌తోపాటు వారి అనుచరులు మంగళవారం వేముల సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి వేముల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వేముల మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైన కాంగ్రెస్ సర్కారు ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని మోతె, బుస్సాపూర్ లాంటి గ్రామాలు ఉద్యమ స్ఫూర్తిని రగిలించి తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచాయని గుర్తు చేశారు. తన తండ్రి దివంగత వేముల సురేందర్‌రెడ్డి, కేసీఆర్ వెంట ఉద్యమ ప్రస్థానంలో మొదటి నుంచి నడిచారని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేండ్ల పాలనలో అనేక రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర పరిస్థితి తిరోగమనంగా సాగుతున్నదని పేర్కొన్నారు. తిరిగి తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ పటిష్టతకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ మెండోరా మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కమలాకర్, మాజీ ఎంపీటీసీలు దేవేందర్, బాబా, మాజీ సర్పంచులు నాగుల నర్సయ్య, గంగారెడ్డి, రాజారెడ్డి, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కమ్మర్‌పల్లిలో వాల్‌రైటింగ్‌ను ప్రారంభించిన వేముల

వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి వేముల పిలుపునిచ్చారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో వాల్‌రైటింగ్‌ను ప్రారంభించారు.



గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

## ఎల్లారెడ్డి సీఐపై ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

### మాజీ ఎమ్మెల్యే జాజాల ఆధ్వర్యంలో చైర్మన్‌ను కలిసిన అంబేద్కర్ సంఘ నాయకులు




ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

లింగంపేట, ఏప్రిల్ 15: మండలంలోని అంబేద్కర్ సంఘం నాయకులు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్‌పై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్రకు మంగళవారం ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే జాజాల ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిశారు. లింగం పేటలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించడంతో పాటు అంబేద్కర్ సంఘం నాయకులతో దురుసుగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ జయంతిని నిలిపివేయించిన సీఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంటనే కామారెడ్డి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనపై దర్యాప్తు చేపట్టి దళితులను అవమాన పరిచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు అంబేద్కర్ సంఘం నాయకులు తెలిపారు. అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం, లింగంపేట మండల అధ్యక్షుడు నీరడి సంగమేశ్వర్, గౌరవ అధ్యక్షుడు ముదాం సాయిలు, మండల ఉపాధ్యక్షుడు ద్యామని భూపతి, నాయకులు ఆశయ్య, రాజు, అల్లూరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

### జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పిలుపు



లచ్చన్ గ్రామంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షిండే

మద్నూర్/ నిజాంసాగర్, ఏప్రిల్ 15: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పిలుపునిచ్చారు. మద్నూర్ మండలంలోని లచ్చన్ గ్రామంతోపాటు మహ్మద్‌నగర్ మండలకేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యరకర్తల సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. గులాబీ జెండా ప్రజలకు అండ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం అందరూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటే బాగుండునని అనుకుంటున్నారని తెలిపారు. గ్రామగ్రామాన బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. మద్నూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బన్సీపటేల్, నాయకులు దరాస్ సురేశ్, విజయ్‌కుమార్, గఫర్, నిజామొద్దీన్, గోవింద్, సంజయ్, రాజుపటేల్, హన్మాండ్లు, రాజు, తులసీరాం, సుధీర్, శ్రీనివాస్, హన్మంత్‌రావు, అశోక్, మహ్మద్‌నగర్‌లో నిర్వహించిన సమావేశంలో బీఆర్‌ఎస్ ఉమ్మడి మండలాల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, పార్టీ అన్నిగ్రామాల శాఖ అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

### షకీల్‌కు హరీశ్‌రావు పరామర్శ



బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ దంపతులను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం పరామర్శించారు. షకీల్ తల్లి షగుఫ్త ఆదిబ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె మృతికి సంతాపం ప్రకటించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బోధన్, ఏప్రిల్ 15